# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

## ఊపిరి

చెప్పులులేని నా కాళ్ళకి మెత్తగా తగులుతోంది పచ్చిక. అచ్చంగా అమ్మ మనసంత మెత్తగా.. అమ్మ తలపు రాగానే, నాకు కాస్త దూరంలో జరుగుతున్న ఆపరేషన్ గుర్తొచ్చింది.

“అమ్మ ఎలా ఉందో? “అనిపించింది..

"కాసేపు అలా నడిచి వస్తాను " అని రాధితో చెప్పి వచ్చానే కానీ నిలవని నా కాలు లాగే మనసు కూడా ఎక్కడా క్షణం సేపు నిలవడం లేదు.

వారం రోజుల క్రితమేమో,..

" మీ అమ్మెందుకో అన్యమనస్కంగా ఉంటోంది, చూశావా తల్లీ?" అన్నారు నాన్న..

" నాకూ అనిపించింది ఒకటిరెండుసార్లు. కానీ, పనిలో ఉండి పెద్దగా గమనించలేదేమో నాన్నా! ఏమయింది?" అడిగాను. కొద్దిగా గిల్టీగా

"ఏమో మరి! అడిగాను కానీ, ఏమీ చెప్పలేదు, ఏమీ లేదంది, నువ్వడిగితే ఏమైనా చెప్తుందేమో, చూడు" అన్నారు

నలభై ఐదు దాటుతున్న నా పెళ్ళి గురించి అమ్మ అప్పుడప్పుడు ఇంకా మాట్లాడుతూనే ఉంటుంది. బెంగ పడుతూనే ఉంటుంది.. నాకెందుకో మొదటినించీ పెళ్ళిమీద పెద్ద సుముఖత ఉండేది కాదు. నేననుకున్నట్లుగా కుదరకా, నాకున్నవి కుదరకా అమ్మా వాళ్ళు ప్రయత్నించిన మూడు నాలుగు సంబంధాలు వెనక్కి వెళ్ళిపోయేసరికి అసలు నాకు పెళ్ళే వద్దని భీష్మించుకుని కూర్చున్నాను..

తమంత ఎదిగిన కూతుర్ని ఏమీ అనలేక, తమలో తామే బాధపడుతూ ఉంటారు అమ్మా, నాన్నా. అలా అమ్మా, నాన్నా నా దగ్గరే ఉండిపోయారు. చెల్లెలు మాత్రం తను కోరినవాడిని పెళ్ళి చేసుకుంది, మేముండే ఊర్లోనే ఉండడం వల్ల తరచూ వస్తూ పోతూ ఉంటుంది.

పిల్లలిద్దరూ తమ కళ్ళెదురుగానే ఉన్నారన్న విషయం అమ్మా, నాన్నలకి ఆనందంగానే ఉన్నా, నా గురించి అమ్మ ఎక్కువగానూ, నాన్న కనిపించకుండానూ ఆలోచిస్తు, బాధ పడుతూ ఉంటారన్నది మాత్రం నిజం.

నా ఉద్యోగం, నా అభిరుచులు, స్నేహితులు నన్నెప్పుడూ బిజీగా ఉంచుతాయి. అందుకేనేమో నేనెప్పుడూ వివాహం కాకపోవడం అనేది నా జీవితంలో ముఖ్యమైనదిగా అనుకోలేదు.. 'ప్రపంచంలో అందరూ పెళ్ళి చేసుకుంటారు, పిల్లల్ని కంటారు, నేనొక్కదాన్నీ అవి చెయ్యనంత మాత్రాన ఏమీ మునిగిపోలేదులే 'అనుకుంటాను చిత్రంగా.

ఈ మాట అమ్మతో అంటే "నువ్వొకసారి ఏదైనా కౌన్సిలర్ దగ్గరకి వెళ్తే మంచిదేమో, ఇవేమీ సాధారణ ఆలోచనల్లా కనిపించడం లేదు చంద్రా" అనేది ఆదుర్దాగా. దానికి ప్రతిగా నేను నవ్వితే ఆవిడకి కోపం వచ్చేది కూడా..

ఇదేమీ చెప్పినా వినే ఘటం కాదులే అనుకుందేమో ఈ మధ్య తను కూడా ఆ విషయాన్ని ఎక్కువగా ప్రస్తావించడం లేదు.

అదే మాట నాన్నతో అని..

" నేను కనుక్కుంటాను లెండి నాన్నా?" అన్నాను మరేం పరవాలేదన్నట్టుగా..

ఎదిగిన కూతురికంటే తల్లికి స్నేహితురాళ్ళుండరు. ఆ సాయంత్రం నేను ఆఫీసునించి రాగానే నాకిష్టమైన పెరుగు చెగోడీలు, అల్లం టీ ఇచ్చింది అమ్మ.

" నువ్వూ తెచ్చుకో అమ్మా!" అన్నాను..

" ఇప్పుడు టీ తాగితే రాత్రికి నిద్ర పట్టదు, గుండెల్లోనూ, కడుపులోనూ మండినట్టవుతుంది, ఒకేసారి అన్నం తినేద్దాం లే, ఇప్పటికే ఆరు దాటిందిగా" అంది..

" మంటా? చెప్పలేదేం? ఎప్పటినించమ్మా?" అన్నాను కాస్త కంగారుగా..

" అబ్బే, మంటేం కాదు ఏదో అలా అనిపిస్తుంది. అయినా అసలు విషయం అది కాదు" అంటూ ఏదేదో అంది నా ఎదురుగా కూర్చుంటూ..

" మంట కాకపోతే మరేమిటి? అసలు విషయం ఏమిటి? వివరంగా చెప్పమ్మా, లేకపోతే నాకెలా తెలుస్తుంది?" అన్నాను అనునయంగా..

అసలే ఆఫీసు పనులతో టెన్షన్ పడుతూ ఉంటాను, ఇంకా అన్నీ చెప్పి నన్ను ఇబ్బంది పెట్టకూడదని కొన్ని ఎప్పుడో మెల్లగా చెప్తారు, కొన్ని చెప్పనే చెప్పరు..అందుకే పదిసార్లు తరచి తరచి అడగాలి..

“పెద్ద విషయం కాదులే “ అంటూ అమ్మ చెప్పిన విషయం నన్ను ఎప్పుడూ లేనంత షాక్ కు గురిచేసింది.. కోపం వచ్చింది..

" ఇలాంటి పరిస్థితి ఉంటే నెలరోజులనించీ మాట్లాడకుండా ఉన్నావా? చదువుకున్నదానివి, ఉద్యోగం చేసి రిటైర్ అయినదానివి. ఇప్పటికీ అన్నీ చదువుతూ, తెలుసుకుంటూ ఉంటావు, అలాంటిది నీకు మొదటిసారి అనుమానం రాగానే నాకు చెప్పద్దా? “ అంటూ అమ్మని నాతో పాటు గదిలోకి తీసుకువెళ్ళాను..

"ఏమిటోనే, తగ్గిపోతుందనుకున్నాను, పైగా నొప్పి లేదు. చేత్తో ముట్టుకుంటేనే తెలుస్తోంది అక్కడ గడ్డలా ఉందని. అందుకే నాకు పెద్దగా అర్థం కాలేదు" ఏదో చెప్తోంది అమ్మ.

గదిలోకి వెళ్ళాకా నేనూ చూశాను తాకి.. అమ్మ కుడి వక్షోజం లో ఇంచుమించు మూడు సెంటిమీటర్లుంటుందేమో, ఇంకా పెద్దదో! గడ్డ. తాకితే బాగా తెలుస్తోంది.. నేను పైకి చూసేసరికి తడికళ్ళతో అమ్మ..

" మీ పిన్ని కేన్సర్ తోనే మూడేళ్ళ క్రితం పోయింది. అమ్మ కూడా తన అరవై తొమ్మిదేళ్ళకి పోయింది,అప్పుడు తెలీదు కానీ, ఇప్పుడావిడ కూడా కేన్సర్ తోనే అనిపిస్తుంది చంద్రీ. ఇది అదే కనక ఐతే ఇవి వంశపారంపర్యంగా వస్తాయన్నది నిజమే అనుకోవాలి కదా. నీకు, రాధికి కూడా వస్తే అన్న ఊహకే భయం వేస్తోంది” అంది..

ఆ మాటలన్నప్పుడు ఆమె కళ్ళల్లో ఇమడలేక కిందకి జారిన కన్నీళ్ళు.

నాలో కలతిరిగే భావాల్ని పైకి పెద్దగా చూపించని నేను ఆ మాటలకి కదిలిపోయాను.

తన పరిస్థితి గురించి బెంగ లేదు తనకి, నాకు, చెల్లెలికి వస్తాయేమో అని తన బాధ.

‘అమ్మంటే అంతేనేమో? “ అనుకుంటేనే నా కళ్ళూ మసకబారాయి.

అమ్మ చూడకుండా పక్కకి తిరిగి ఆపుకుని, ఆవిడని స్థిమితంగా కూర్చోబెట్టి మాకు బాగా తెలిసిన గైనకాలజిస్ట్ కి ఫోన్ చేసి వెంటనే అపాయింట్ మెంట్ తీసుకున్నాను. మరో రెండు గంటలకల్లా డాక్టర్ దగ్గర ఉన్నాము. డా. పద్మినీ ప్రసాద్ మాకు చాలా కాలంగా తెలిసిన డాక్టర్. ఆవిడకి చూస్తూనే పరిస్థితి అర్థం అయింది. వెంటనే ఏం చెయ్యాలో చెప్పింది నాకు. అక్కడనించే నేరుగా కేన్సర్ శ్రీనాధ్ గారి స్పెషలిస్ట్ దగ్గరకి వెళ్ళాము, ఆయన చెప్పినది అదే.. మేమోగ్రాం చూపించినది అదే..

ఆపరేషన్ చెయ్యడమే మంచిదన్నారు ఇద్దరూ కూడా. ‘నిర్ణయం మీదే’ అన్నారు.

అదృష్టవశాతూ మిగతాచోట్లకి పాకలేదు అప్పటికి. అందువల్ల ఆపరేషన్ చేసి గడ్డ తీసెయ్యాలి, బ్రెస్ట్ తొలగిస్తే మంచిది. ఆపైన రేడియేషన్ లేదా కీమో థెరపీ చేస్తే సరిపోతుంది అన్నారు.. కానీ అమ్మ వయసు, ఆవిడకున్న మధుమేహం దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలి, అది పూర్తిగా మీ ఇష్టం.. ఏది మంచిదో ఒకటి రెండురోజుల్లో చూద్దాం. అంటూ చెప్పారు

విన్నవన్నీ జీర్ణించుకోవడానికి కూడా టైము లేనంత త్వరగా సినిమా రీళ్ళలా తిరిగిపోయాయి ఈ సంఘటనలన్నీ..

"మీరు మాట్లాడుకుంటూ ఉండండి, నేను ఈ లోగా టిఫిన్ తెస్తాను అందరికీ" అంటూ వెళ్ళాడు మా మరిది శేఖర్.

మేము మాట్లాడుకుని నిర్ణయించుకోవాలనంది అతని ఉద్దేశ్యం, నాకార్థమయింది.

చెల్లెలు రాధికా, నాన్నా ఏడవడం మొదలు పెట్టారు. అమ్మ ధైర్యంగానే కనిపించింది. పరిస్తితిని ఎదుర్కోవాలి తప్ప ఏడిస్తే ఏమవుతుంది? అన్నదే మా ఇద్దరి ఆలోచన. నాది అమ్మ పోలిక అనుకుంటాం ఎప్పుడూ, మేమిద్దరం వాళ్ళనెలా ఊరడించాలా అని చూస్తున్నాం.

" రాధీ, ఊరుకో, నీకేమైనా వెర్రా? కాం డవున్" అన్నాను కాస్త గట్టిగా.అప్పటికి నాన్న కూడా స్థిమితపడి కళ్ళుతుడుచుకున్నారు. బాత్ రూం కి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చారు.

" అమ్మా, నీ దగ్గరనించి ఏదీ దాచదల్చుకోలేదు నేను.నువ్వు చదువుకున్నదానివి, లోకన్ని చూసినదానివి. నీకు తెలీనిదేమీ కాదు. శరీరంలో అది ఉండడం మంచిది కాదు కనక ఆపరేషన్ చేసి తొలగించడం మంచిదని డాక్టర్లు చెప్పారు, అది ఒక్క గడ్డనా, లేక మొత్తం బ్రెస్ట్ ని తొలగించాలా అన్నది ఈరోజో, రేపో చెప్తారు. అందుకని నువ్వు జాగ్రత్తగా ఆలోచించుకుని చెప్పమ్మా, ఏదైనా ఇది నీ నిర్ణయం అవ్వాలి తప్ప ఎవరో చెప్పారని నువ్వు తీసుకోకూడదు” అన్నాను.

అలా అని రాధిని తీసుకుని వంటగదిలోకి నడిచాను కాఫీ కలిపే మిష మీద. కాసేపు అమ్మా, నాన్నా ఒంటరిగా ఉండాలన్నది నా ఉద్దేశ్యం..

మరో అరగంటవరకూ కాఫీ కలుపుతూనే ఉన్నాము. ఆ తర్వాత కాఫీ కప్పులతో వచ్చేసరికి " డాక్టర్లు ఎలా చెప్తే అలాగే చేద్దాం, నాకేమీ పరవాలేదు.. నేను బావుంటాను, మీరందరూ ఉండగా నాకేమవుతుంది?ఏమైనా అయితే మాత్రం తక్కువేమిటి? నాన్నని జాగ్రత్తగా చూసుకోవడానికి మీరిద్దరూ లేరూ" అంది అమ్మ ధృడంగా..

ఆఖరి వాక్యం అంటున్నప్పుడు నాన్న చేతిని గట్టిగా పట్టుకుంది.

"నీకేం కాలేదు దుర్గమ్మా, అప్పుడొకసారి నాకు కుడి భుజం మీద గడ్డ రాలేదూ? మందులిస్తే కరిగిపోయింది చూడు, దానికంటే కాస్త పెద్దది, అంతే!" అన్నారు నాన్న.. బాగా ఆప్యాయంగా మాట్లాడేటప్పుడు దుర్గమ్మా అంటారు నాన్న అమ్మని. విజయదుర్గ అమ్మ పేరు.

నవ్వాను నేను.

తెలిసే అంటున్నారో, తన యాభై ఐదేళ్ళ సహచరిని అసలు విషయం మరిపించడానికి ప్రయత్నిస్తూ అంటున్నారో తెలీలేదు.

నిర్ణయం అయింది కనక కాఫీ తాగి టిఫిన్లు తిన్నాం..

ఆ తర్వాత కావలసిన పరీక్షలు అయ్యాయి. ఆపరేషన్ కి తేదీ, సమయం నిర్ణయించారు. ఆవిడ ఆరోగ్యాన్ని, వయసుని దృష్టిలో ఉంచుకుని ఆపరేషన్ చేస్తామని, మత్తుమందు ఇవ్వడం అవీ దగ్గరుండి చూసుకుంటామని చెప్పారు..

ఆపరేషన్ కి మా ఇష్టపూర్వకంగా ఒప్పుకున్నామని, ఇంకా అలాంటివే రాసున్న పత్రం మీద సంతకం చేస్తున్నప్పుడు తెలీకుండానే నా చేతులు ఒణికాయి.

విడదీసినా విడిపోయేది కాదు పేగు బంధం..

ఆకుపచ్చని ఆసుపత్రి గౌన్లో అమ్మ. నుదిటిన ఎర్రని కుంకుమ బొట్టు.. నీరసంగా ఉన్నా ధీమాగా ఉన్న కళ్ళు. మమ్మల్ని చూసుకునే!! నన్ను చూసి నవ్విన చిన్న చిరునవ్వు..

" మేడం మీరు చెయ్యి వదిలేత్తేలోపలకి తీసుకెళ్తాం' అంది నర్స్..

నేను, రాధీ అమ్మ రెండు చేతులూ ఒకేసారి వదిలేసాం.

నాన్న చెయ్యి ఊపారు. “వెళ్ళిరా దుర్గమ్మా, ఇక్కడే ఉంటాం నీకోసం ఎదురుచూస్తూ!" అన్నారు దేవుడి పూజలోంచి మందారాన్ని ఆసుపత్రి టోపీ తప్పించి అమ్మ తల్లో పెడుతూ.

అమ్మ మళ్ళీ నవ్వింది.. నాన్న చేతిని పట్టుకుని వదిలేసింది..

తలుపు మూసుకుంది..

గత నాలుగురోజులుగా అమ్మకి అప్పుడే తెలియకూడదనుకున్న విషయాలని డాక్టర్లతోనూ, స్నేహితులతోనూ, లేదా బంధువులతోనూ మాట్లాడాలంటే నేనెంచుకున్న మార్గం వాకింగ్. అప్పుడప్పుడు రోజుకు నాలుగైదు సార్లు చేసేదాన్ని..

ఇప్పుడు అక్కడ కూర్చోవాలనిపించక రాధికి, శేఖర్ కి చెప్పి కాస్త దూరంగా నడిచాను..

చెప్పులు విప్పేసి నడవడం మొదలుపెట్టాను.కాళ్ళతో నే తొక్కాలనిపించనంత ఒత్తుగా, ఆకుపచ్చగా ఉంది లాన్. కాళ్ళకి మెత్తగా తగులుతోంది పచ్చిక.. అంతకన్నా మెత్తగా పడింది నా భుజం మీదో చెయ్యి..

వెనక్కి తిరిగి చూశాను.నాన్న..

" అమ్మా, మీ అమ్మకి" అన్నారు, జీరగా ఉన్న గొంతుతో..

" ఏం పరవాలేదు నాన్న, వీళ్ళందరూ సిటీలోనే బెస్ట్ డాక్టర్ లు, మీకు తెలియనిది కాదుగా" అన్నాను చిన్నగా.

" అది తెలుసమ్మా, కానీ మీ అమ్మకి, ఈ ఆపరేషన్ ఒక్కటి చాలమ్మా, ఆపైన ఇంకేమీ వద్దు.” అన్నారు నిదానంగా.

ఈసారి గొంతులో జీర లేదు. స్థిరంగా ఉంది..

" అంటే?" అన్నాను అర్థం కానట్టు..

" అదేనమ్మా, మొన్న మనం మాట్లాడుకున్నదే.. ఆపరేషన్ అయ్యాకా కీమో, రేడియేషన్ లాంటివేమీ వద్దు" అన్నారు..

నా మనసులో మెదులుతున్నది అదే! ఏదీ నిర్ణయించుకోలేకే ఇలా తిరగడానికి వచ్చాను. 'కీమోథెరపీ తీసుకుంటే పూర్తిగా తగ్గిపోతుంది' అంటూ అందరూ చెప్తున్న మాట ఒక పక్కా.

" మీ పిన్ని అనుభవించిన బాధ చూశాను, నన్ను ఆ టార్చర్ కి గురిచెయ్యద్దు" అంటూ అమ్మ చెప్పిన మాటలొక పక్కా..

ఏదీనిర్ణయించుకోలేకపోతున్నాను.

' ముందు ఆపరేషన్ పూర్తవనీ, ఆతర్వాత అందరితోనూ కలిసి ఆలోచిద్దాం' అని ఊరుకున్నాను ప్రస్తుతానికి..

ఒక్కోమెట్టే ఎక్కితే మంచిదని నాఉద్దేశ్యం..

"నిన్న రాత్రి చెప్పిందమ్మా !మీ అమ్మ మళ్ళీ.."

కేన్సర్ కంటే కీమో థెరపీతోనే రోగులు ఎక్కువ బాధపడతారని తనకి తెలుసంది. మీ పిన్ని సంగతి మనకి తెలుసుకదా. ఈ ఆపరేషన్ ఒక్కటి చాలు, ఆపైన మందులు వేసుకుంటాను, మీ ముగ్గురూ ఉండగా నాకింకేమీ కాదు అంది..

"కీమో మాత్రం ఎట్టిపరిస్తితుల్లోనూ వద్దని, తనకి చేయించనని నాతో ఒట్టు వేయించుకుంది. అన్నారు." నాన్న గొంతులో మళ్ళీ జీర..

"ఎన్ని పుస్తకాలు చదువుతుందో నీకు తెలుసుగా అమ్మా, 'వెన్ బ్రెత్ బికంస్ ఎయిర్' అనే పుస్తకం చదివిందిట..

అందులో చెప్పినట్లు ఇలాంటి పరిస్థితుల్లో బ్రతికున్నామా, లేదా ?అన్నది ముఖ్యం కాదు, ఎంత బాగా బ్రతికున్నామా అన్నది ముఖ్యం అందమ్మా. ప్రతీ నిమిషం బాధపడుతూ, నావాళ్ళని బాధ పెడుతూ నా జీవితాన్ని మరి కొన్ని నెలలో, ఏళ్ళో పొడిగించుకునే కంటే ఇలాగే ఉంటూ, నాకు ఆయువున్ననాళ్ళు ఉండడమే నాకిష్టం.

ఎన్ని సూదులు పొడిచినా, మందులు పోసినా చివరికి నాకెన్ని ఆకులు రాసున్నాయో అన్నే కదా మిగిలేవి. దీన్ని వేదాంతమనండి, భయమనండి, మీ ముగ్గురిమీదా నాకున్న ప్రేమనండి, లేదా నాస్వార్థమనండి.. పేరేదైనా నాకు పరవాలేదు, కానీ నాకింకే ట్రీట్మెంట్ లు వద్దు అని మరీ మరీ చెప్పిందమ్మా.

అందుకని అలాంటి ప్రయత్నాలేమీ చెయ్యద్దు మనం. ఆపరేషన్ అవగానే సాధ్యమైనంత త్వరగా ఇక్కడనించి ఇంటికి తీసుకుపోదాం. ఈ ఫైవ్ స్టార్ హోటల్ లాంటి ఆసుపత్రికన్నా, మీరు కట్టిన ఇల్లే నాకు బావుంటుంది, నేను త్వరగానే వచ్చేస్తాను. అక్కడుంటే నాకు గాలి ఆడదు, తప్పదని వెళ్ళాలి తప్ప. నా ఊపిరి మీ ముగ్గురే! ఈ ట్రీట్మెంట్లతో దాన్ని పొడిగించాలని చూడద్దు.మీరుండగా నాకేమీ అవదు, అయినా పరవాలేదు. అందమ్మ!" అంటూ ఆగారు ఇంక చెప్పలేనట్టుగా..

ఇంకా మేము రాలేదమని చూడడానికి వచ్చారు రాధికా, శేఖర్ అప్పటికే.. నిర్ణయం నా ముఖంలో కనబడిందనుకుంటా మమ్మల్ని చూసి చిన్నగా నవ్వింది రాధిక.

'

●●●

Click here to share your comments on this story